ఘనంగా గంధ మహోత్సవం


దర్గాలో ప్రత్యేక పూజలు చేస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: పట్టణంలోని ఒంగోలు–కంభం రోడ్డు జంక్షన్‌లో ఉన్న హజరత్ నాగూర్‌మీరా స్వామి(హజరత్ ఖాదర్‌వలి) గంధ మహోత్సవ వేడుకలు ఆదివారం రాత్రి అత్యంత వైభవంగా జరిగాయి. ఉరుసు సందర్భంగా స్వామి వారి దర్గాను విద్యుత్ దీప పూల అలంకరణలతో సుందరంగా తీర్చిదిద్దారు. తొలుత స్వామి జెండాను మేళ తాళాలతో పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. హజరత్ వారి దర్గాపై పూల్ చాదర్, పూజా వస్త్రం ఉంచి మొక్కులు తీర్చుకున్నారు. తొలుత స్వామి జెండాను ఎస్‌కే షఫీ ఆధ్వర్యంలో అత్యంత భక్తి శ్రద్ధలతో పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. కుల మత వర్గాలకు అతీతంగా దర్గాకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మొక్కుబడులు ఉన్నవారు హజరత్ వారి దర్గా వద్ద పూల్ చాదర్, పూజా వస్త్రం ఉంచి మొక్కులు తీర్చుకున్నారు.

చైర్మన్ గఫార్ ప్రత్యేక పూజలు

మున్సిపల్ చైర్మన్ ఎస్ అబ్దుల్ గఫార్ దర్గాలో విశిష్ట పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చైర్మన్ గఫార్ ప్రారంభించారు.

కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాణిక్యరావు, కౌన్సిలర్ సయ్యద్ రిజ్వాన ఖాలక్, కోఆప్షన్ సభ్యుడు జి.అబ్రహం లింకన్, ఏఎంసీ డైరక్టర్ బొట్టు శ్రీను, విజేత విద్యా సంస్థల అధినేత పసుపులేటి అరుణోదర్, థెరిస్సా సేవాసమితి అధ్యక్షుడు ఎస్ఎస్ రసూల్, ద్రోణాదుల చెంచులు, వైఎస్సార్ సీపీ పట్టణ యూత్ అధ్యక్షుడు డాక్టర్ రసూల్, నాయకులు ఎస్‌కే మన్సూర్, నాగూర్‌బీ, భారతీ, మున్నా, నిర్వాహకులు ఎస్‌కే షఫీ, జిలాని, సయ్యద్ ఇమామ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు


వ్యవసాయంలో డ్రోన్ వినియోగంపై రైతులకు వివరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

సీఎస్‌పురం(పామూరు): ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులు అవగాహన కలిగి ఉండి అధిక దిగుబడులు సాధించాలని ఎంపీడీఓ సీహెచ్.రామచంద్రరావు అన్నారు. మండలంలోని చెన్నపునాయునిపల్లి, రేగులచలక గ్రామ పంచాయతీల పరిధిలో ఆదివారం సర్పంచ్ యనమల పెద్ద సుబ్బయ్య అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే పథకాలు, రాయితీలు వివరించారు. పౌష్టికాహారం లాభాలు, వైద్యసిబ్బంది ఆరోగ్య పథకాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులపై వివరించి వ్యవసాయంలో డ్రోన్ వినియోగించి పంటలకు క్రిమిసంహారక మందులను పిచికారీ చేసే విధానంపై రైతులకు వ్యవసాయ సిబ్బంది వివరించి అనంతరం డ్రోన్‌ద్వారా పంటలకు మందు పిచికారీ చేసి చూపించారు. ఈఓపీఆర్‌డీ కె.సుందరరామయ్య, మానవహక్కుల వేదిక అధ్యక్షుడు డాక్టర్ షేక్.గౌస్, పీఎస్‌లు రసూల్, బుర్రి గురవయ్య, డాక్టర్ హోమద్యుతి, ఎంపీఈఓ మోడి వెంకటేశ్వర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు శైలజ, శశి, రైతులు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

లింగసముద్రం: స్థానిక తాహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు ఎంపీడీఓ శేషుబాబు తెలిపారు. కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ

జరుగుమల్లి: మండలంలోని కామేపల్లి పోలేరమ్మ దేవస్థానంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలేరమ్మను దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకులు అభిషేకాల అనంతరం పోలేరమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి, జంతు బలులు ఇచ్చి మొక్కులు చెల్లించారు. భక్తులు కుంకుమ పూజ, గోత్ర నామార్చనలు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈఓ రావెళ్ల శివశంకర్, ధర్మకర్తల మండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా గోపూజ, మహా నివేదన


గోపూజలో పాల్గొన్న అర్చకులు, కమిటీ సభ్యులు, భక్తులు


మహానివేదనతో ప్రదక్షిణలు చేస్తున్న అర్చకులు, కమిటీ సభ్యులు, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం మహానివేదన, గోపూజ అర్చకులు సత్యనారాయణ ఆధ్వర్యంలో వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోవుకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. నారాయణస్వామి మూలవిగ్రహమూర్తికి అభిషేకం, విశిష్ట పూజలు చేశారు. స్వామి గర్భాలయాన్ని ప్రత్యేక పూలతో సుందరంగా తీర్చిదిద్దారు. భజంత్రీల మేళతాళాల నడుమ నైవేద్యంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ జి.రమణారెడ్డి, ముడుమాల నారాయణరెడ్డి, కొమ్మినేని వెంకట్రావు, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెంచు గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

పెద్దదోర్నాల: మండల పరిధిలోని బలిజేపల్లి గిరిజన గూడెం చెంచు గిరిజనులకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. స్పందించే హృదయాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పులి శ్రీనివాసప్రసాద్ ఆధ్వర్యంలో గూడెంలోని 25 కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ శీతాకాలంలో చలి తీవ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో చెంచు గిరిజనులకు రాజస్తాన్ దుప్పట్లను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో ట్రస్ట్ రాష్ట్ర సభ్యులు తన్నీరు బాల రంగారావు, వలంటీర్ బాలరాజు నాయక్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


అవగాహన ర్యాలీలో సర్పంచ్, ప్రోగ్రాం అధికారి

కనిగిరి రూరల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సర్పంచ్ దానమ్మ అన్నారు. మండలంలోని చిన ఇర్లపాడు పంచాయతీలో ఆదివారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ ప్రత్యేక క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దానమ్మ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వామ్యులు కావాలన్నారు. గ్రామంలో అవగాహనర్యాలీ, పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి వి.రామరాజు, కళాశాల ప్రిన్సిపాల్ పాలెం రెడ్డి రమణారెడ్డి, ఉప సర్పంచ్ కృష్ణారెడ్డి, హెచ్ఎం వి.ప్రసాద్, ఉపాధ్యాయులు రఫీ, కోటి సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులోని అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు వెంకటేశ్వర్లు కుంకుమార్చన, అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఆవరణలోని పుట్ట, నాగశిలలకు భక్తులు పూజలు చేశారు. పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శ్రీధర్ రెడ్డి పర్యవేక్షించారు.

13న వర్ణయుగం, దమనకాండ పుస్తకాల ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కందుకూరు: ప్రముఖ రచయిత బద్దిపూడి జయరావు రచించిన వర్ణయుగం, ధమనకాండ పుస్తకాలను ఈనెల 13న ఆవిష్కరించనున్నారు. ఈమేరకు ఆదివారం స్థానిక అంబేడ్కర్ బొమ్మ సెంటర్ వద్ద ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సభకు ముఖ్యఅతిథులుగా రామన్ మెగసేసే అవార్డు గ్రహీత బెజవాడ విల్సన్, సుప్రసిద్ధ సినీ దర్శకుడు ఇ.ప్రేమ్‌రాజ్ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఈ నెల 13వ తేదీ సాయంత్ర 4 గంటలకు స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతుందని, కావున కవులు, కళాకారులు, మేధావులు, ప్రజలు అత్యధికంగా పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీటీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె మోహన్‌రావు, ఎంఈఎఫ్ డివిజన్ అధ్యక్షుడు జడ రాములుమాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి మున్నంగి రమేష్, ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు జలదంకి నరశింగరావు మాదిగ, న్యాయవాది ఎల్ బ్రహ్మయ్య, డి మోహన్‌రావు, మాలకొండయ్య, చదలవాడ కోటేశ్వరరావు, ఎండ్లూరి పోతులూరి, కె శిరోమణి, క్రిష్టాఫర్, రవి, చిన్న తదితరులు పాల్గొన్నారు.

అయ్యపురాజుపాలెంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

మర్రిపూడి: మండలంలోని అయ్యపురాజుపాలెం గ్రామంలోని సచివాలయం వద్ద వికసిత్ భారత్ సంకల్పయాత్ర గ్రామసభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ యాళ్ల రాణి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. అనంతరం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యపురాజుపాలెం గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. పలువురికి సర్పంచ్ రాణి చేతులమీదుగా గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ కొండపి నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు శ్రీనివాసులు, కాకర్ల వైద్యాధికారి తేజ, వై.కావ్య, సీనియర్ అసిస్టెంట్ సయ్యద్ సుకుర్, పంచాయతీ కార్యదర్శి శ్రీను, సుదీర్, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.


మహిళలకు గ్యాస్ కనెక్షన్ అందజేస్తున్న సర్పంచ్ రాణి

పట్టుదలతో చదివితే మంచి మార్కులు


సుబ్బారెడ్డిని సన్మానిస్తున్న ఎంఈఓ నాయక్, పక్కన మల్లికార్జునరెడ్డి

మార్కాపురం: పట్టుదల, కృషితో చదివితే పదో తరగతి విద్యార్థులు మంచి మార్కులు సాధించవచ్చని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు పోకల సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ అన్‌ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో మార్కాపురం డివిజన్‌లోని వివిధ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న 600 మంది విద్యార్థులకు ఆదివారం పట్టణంలోని డి కన్వెన్షన్ హాల్లో డివిజన్ అధ్యక్షులు జి.మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్, ఓరియంటేషన్ తరగతులు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఈ రెండు నెలలూ అకుంఠిత దీక్షతో చదవాలని సూచించారు. ఎంఈఓ రాందాస్‌నాయక్ మాట్లాడుతూ.. తల్లిదండ్రుల ఆలోచనలకు అనుగుణంగా సెల్‌ఫోన్లను దూరంపెట్టి ఇష్టంతో కష్టపడి చదవాలని సూచించారు. ఓరియంటేషన్ క్లాసులు ఇంకా నిర్వహిస్తామని ప్రతినిధులు మల్లికార్జునరెడ్డి, రంగయ్య, శ్రీనివాసరావు, వికాస్ శ్రీనివాసరావు తెలిపారు.

అర్హులందరికీ పెన్షన్లు మంజూరు


నూతన పెన్షన్ పంపిణీ చేస్తున్న నాయకులు

పామూరు: అర్హులందరికీ పార్టీలకతీతంగా రూ.3 వేల పింఛన్ అందుతుందని వైఎస్సార్ సీపీ రైతు విభాగం మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాసులు రెడ్డి, మాజీ సర్పంచ్ కందుల శివరామిరెడ్డి అన్నారు. మండలంలోని దూబగుంట్ల కాలనీలో ఆదివారం ఇటీవల నూతనంగా మంజూరైన పెన్షన్లతో పాటు, పెంచిన రూ.3 వేల పెన్షన్ నగదును లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వృద్ధాప్య పెన్షన్ మొత్తాన్ని ఏటా రూ.250 చొప్పున పెంచి రూ.3 వేలు ఇస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలను 95 శాతానికి పైగా అమలుచేసి మాటనిలబెట్టుకున్న ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

దశలవారీగా వార్డుల్లో అభివృద్ధి


నూతన విద్యుత్ పోల్స్ ఏర్పాటును పరిశీలిస్తున్న చైర్మన్, కమిషనర్

కనిగిరి రూరల్: దశలవారీగా పట్టణంలోని అన్ని వార్డులో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక 13వ వార్డులో నూతన విద్యుత్ పోల్స్‌ను ఆదివారం ఏర్పాటు చేశారు. పీతుల దొరువు, మంగళిమాన్యం, మదీనా మసీద్ వీధుల్లో కొత్త స్తంభాలను ఏర్పాటు చేసి, మరికొన్ని స్తంభాల ఏర్పాటుకు స్థలాలను మున్సిపల్ చైర్మన్ గఫార్, కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, కౌన్సిలర్ సయ్యద్ రిజ్వాన ఖాలక్ పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ అబ్దుల్ గఫార్, కమిషనర్ నారాయణరావు మాట్లాడుతూ విద్యుత్ పోల్స్ అవసరమైన చోట ప్రాధాన్యత ప్రకారం కొత్త పోల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. వార్డుల్లోని వీధుల్లో కొత్త స్తంభాల ఏర్పాటుకు స్థానికులు..అధికారులకు, విద్యుత్ సిబ్బందికి సహకరించాలన్నారు. ప్రజా సహకారం లేకపోతే నూతన ట్రాన్స్‌ఫారం ఏర్పాటు, కొత్త పోల్స్ ఏర్పాటు జరగదని, దాని వల్ల ప్రజలకే నష్టం వాటిల్లుతుందన్నారు. అభివృద్ధికి అందరూ సహరించాలని కోరారు. పీతుల దొరువు వీధిలో నూతన సైడు కాలువ ఏర్పాటు చేయాలని, పారిశుధ్యం సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కమిషనర్, చైర్మన్‌కు విన్నవించారు. మున్సిపల్ జనరల్ ఫండ్‌లో తక్షణ చర్యగా కాలువ నిర్మాణం చేపడతామని చైర్మన్ హామీ ఇచ్చారు.

రేషన్ పంపిణీ పరిశీలన

పట్టణంలో జరుగుతున్న మొబైల్ రేషన్ పంపిణీని ఆదివారం చైర్మన్ గఫార్, కమిషనర్ నారాయణరావు, కౌన్సిలర్ సయ్యద్ రిజ్వానా ఖాలక్ తనిఖీ చేశారు. రేషన్ పంపిణీ చేస్తున్న విధానం, ప్రభుత్వం అందచేస్తున్న బియ్యం, నిత్యావసర సరుకులు తదితర అంశాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చైర్మన్ గఫార్ మాట్లాడుతూ రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడినా..కొలతల్లో తేడాలు చేస్తున్నట్లు ఫిర్యాదులు చేసినా ఉపేక్షించేది లేదన్నారు. ప్రజా ఫిర్యాదులు వస్తే తక్షణ విచారణ చేసి ఎండీయూ ఆపరేటర్‌లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మొబైల్ రేషన్ పంపిణీ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కౌన్సిలర్ దేవకి, గృహ సారథులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్మృతి కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

కందుకూరు: భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మృతి కార్యక్రమాలను విజయవంతం చేయాలని దళిత, బహుజన, అంబేడ్కర్, బుద్దిస్టు సాహిత్య, సాంస్కృతిక సంస్థలు పులుపునిచ్చాయి. ఆదివారం స్థానిక అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం వద్ద నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 8వ తేదీన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేయడం ద్వారా కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహంతోపాటు శ్రీనగర్‌కాలనీ, దూబగుంట అంబేడ్కర్ విగ్రహాల వద్ద కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంబేడ్కర్ స్ఫూర్తితో రాష్ట్రంలో విప్లవాత్మకమైన సంస్కరణలకు బీజం పడిందని, సామాజిక న్యాయం దిశగా అడుగులు పడుతున్నాయని చెప్పారు. దీనిలో భాగంగా సామాజిక న్యాయం అనే అంశంపై సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద 9వ తేదీ చర్చా కార్యక్రమం జరుగుతుందన్నారు. 10వ తేదీ రక్తదాన శిబిరం, 12వ తేదీ ఐక్యతా సమతా భావం ప్రతిబింబించే విధంగా మానవహారం నిర్వహించనున్నారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకుల, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జాషువా సాహిత్య, సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు ముప్పవరపు కిశోర్, న్యాయవాదులు పోకూరి కోటయ్య, పండిత్ సంపత్‌కుమార్, ధమ్మ చక్ర ఫౌండేషన్ అధ్యక్షుడు, ఉపాసకులు గాంధ్ల హరిప్రసాద్, ఏఏడీ మాజీ అధ్యక్షుడు గేరా చిరంజీవి, ఉపాధ్యక్షుడు చనమాల కోటేశ్వరరావు, శ్రీనగర్‌కాలనీ అంబేడ్కర్ విగ్రహ కమిటీ నాయకులు గంటినపల్లి సూర్యనారాయణ, ఎస్సీ, ఎస్టీ రైతు కూలీ సంఘం డివిజన్ అధ్యక్షుడు పంది నరసింహం, ఎస్సీ మహిళా నాయకులు తలారి ప్రసన్నకుమారి, బిరుదల సంధ్యారాణి, దళిత నాయకులు కంకణాల బ్రహ్మయ్య, ముప్పవరపు రమేష్, జంగిలి సుబ్బారావు, గడ్డం యేసోబు, బహుజన నాయకులు ముతకని లక్ష్మీనారాయణ తదితరలు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ


ఏర్పాట్లు పరిశీలిస్తున్న చింతపల్లి హరిబాబు, మల్లవరపు రాఘవరెడ్డి

టంగుటూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు నూతనంగా మంజూరైన పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు మల్లవరపు రాఘవరెడ్డి కార్యక్రమం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు రూ.3 వేలు పింఛను అందజేస్తారని తెలిపారు. మండలంలోని పింఛను లబ్ధిదారులు, ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ హోదాల్లో ఉన్న ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతంచేయాలని కోరారు.

కొండపి(టంగుటూరు): కొండపి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు పింఛను పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రమణమూర్తి ఆదివారం ఒక్క ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రివర్యులు డాక్టర్ ఆదిమూలపు సురేష్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని పేర్కొన్నారు, కావున మండలం లోని పింఛనుదారులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

క్లుప్తంగా

12 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు

వెలిగండ్ల: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ టి.సుకుమార్ తెలిపారు. ఈనెల 12న పి. నాగులవరం, 19న పి.రాళ్లపల్లి, ఫిబ్రవరి 2న ఇమ్మడిచెరువు, 9న రామగోపాలపురం, 13న గన్నవరం, 20న కంకణంపాడు, 27న మొగళ్లూరు, మార్చి 5న హుస్సేన్‌పురం, 12న మరపగుంట్ల, 19న కొట్టాలపల్లి గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

గ్రంథాలయంలో చదవడం నాకిష్టం


విద్యార్థినికి ప్రైజు అందిస్తున్న వర్ధనరాజు

టంగుటూరు: స్థానిక గ్రంథాలయంలో చదవడం నాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించినట్లు గ్రంథాలయ నిర్వాహకుడు గుమ్మడి వర్ధనరాజు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభలో కథ, పద్యం, స్టోరీ బాగా చదివిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినికి బహుమతి అందించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హైదరాబాద్ వెళ్లి పింఛన్ అందచేత

పుల్లలచెరువు: పుల్లలచెరువుకు చెందిన బత్తుల రమణ ఆరోగ్యం బాగ లేకపోవడంతో హైదరాబాద్‌లోని వైద్యశాలలో ఆపరేషన్ చేయించుకుంది. రమణకు పింఛన్ ఇవ్వాలని వలంటీర్ మాలపాటి బాలకృష్ణ రమణ ఇంటికి వెళ్లగా కుటుంబ సభ్యులు ఆమె గురించి తెలిపారు. వెంటనే బాలకృష్ణ తన సొంత ఖర్చులు పెట్టుకుని హైదరాబాద్ వెళ్లి వైద్యశాలలో ఉన్న రవమణకు పింఛన్ అందచేశారు. కేవలం ఆదివారం చివరి తేదీ కావడంతో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో వెళ్లి ఇచ్చినట్లు ఆయన తెలిపారు. గ్రామస్తులు, రమణ కుటుంబ సభ్యులు బాలకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని లక్కవరం గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నారని ఎస్సై వైవీ రమణ్యకు వచ్చిన సమాచారం మేరకు దాడి చేసి 46 మద్యం బాటిళ్లు పట్టుకుని ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఏడుకొండలు షాపులో 8 బాటిళ్లు, దేవెళ్ల రమణమ్మ ఇంట్లో 38 బాటిళ్లు రైడ్ చేసి పట్టుకున్నారు. మద్యం బాటిళ్లను సీజ్ చేసి వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

ముండ్లమూరు: మండలంలోని పసుపుగల్లు, పోలవరం, వేములబండలో అమ్ముతున్న 49 అక్రమ మద్యం బాటిళ్లను ఎస్ఐ యూవీ కృష్ణయ్య ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. పసుపుగల్లులో కాకునూని ఏడుకొండలు వద్ద 17, పోలవరంలో కొణతం అక్కిరెడ్డి వద్ద 25, వేములబండలో దిగుడు తిరుపతిరావు వద్ద 7 మద్యం బాటిళ్లను షాపుల్లో విక్రయిస్తుండగా దాడి చేసి పట్టుకుని బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో నాగూర్ మీరావలి గంధ మహోత్సవం


గంధ గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కురిచేడు: శ్రీనాగూర్ మీరావలి గంధ మహోత్సవం ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కులమతాలకతీతంగా నిర్వహించే ఈ మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆటగుర్రంపై గంధాన్ని ఉంచి గ్రామోత్సవం చేశారు.

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి అర్చనలు, సహస్రనామ, కుంకుమ పూజలు, అఖండ హారతి పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

చెన్నకేశవస్వామి ఆలయంలో అధ్యయన ఉత్సవాలు

మార్కాపురం టౌన్: ధనుర్మాసం సందర్భంగా చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామివారికి, శ్రీ రామానుజచార్యులవారికి అధ్యయన ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం 6 గంటలకే స్వామివారికి పంచామృతాభిషేకాలు, పంచామృత స్నానం, తోమాల సేవలు నిర్వహించారు. ఉత్సవాల్లో ఆలయ చైర్మన్ పెనుగొండ కేశవరావు, ఈఓ శ్రీనివాసరెడ్డి, పలువురు ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.